క్లుప్తంగా

ఎస్సారెస్పీ కెనాల్‌లో చెత్త తొలగింపు


చెత్తను తొలగిస్తున్న జేసీబీ

వెల్గటూర్: భారీ వర్షాలతో కోటిలింగాల కమాన్ వద్ద గల ఎస్సారెస్పీ డీ-53 కెనాల్‌లో భారీగా వచ్చిన వరద నీటితో కెనాల్ పక్కన ఎస్సీ కాలనీ మొత్తం నీట మునిగింది. వరద నీరు ఇళ్లో చేరి కాలనీవాసులంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఏళ్లుగా కెనాల్‌లో చెత్తాచెదారం శుభ్రం చేయక పోవడంతో విపరీతంగా చెత్త పేరుకుపోయి వరద నీరు వెళ్లని పరిస్థితిలో కాలనీ వాసుల ఇబ్బందిని గమనించిన ఎంపీటీసీ పెద్దూరి హారిక తన సొంత ఖర్చుతో జేసీబీ సాయంతో చెత్తా చెదారాన్ని తొలగించి కెనాల్‌ను శుభ్రపరిచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్దూరి భరత్, పట్టణ అధ్యక్షుడు రంగు తిరుపతి, ఉపాధ్యక్షుడు గుండ జగదీశ్వర్ పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు


వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో ప్రభు

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో ప్రభు అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రాపూర్, డబ్బా గ్రామాలను సందర్శించారు. ఎర్రాపూర్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంట నిండిపోవడంతో కుంటలోనే ఉన్న బోరు బావి మునిగి తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలపగా, వెంటనే భగీరథ అధికారులకు ఫోన్ చేసి తాగునీరు అందించాలని ఆదేశించారు. డబ్బా గ్రామంలో పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై అవగాహన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో ఈవీఎం, వీవీప్యాట్‌లను వినియోగంపై ఓటర్లకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవీఎంలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించారు. ఈవీఎంపై ఏ బటన్ నొక్కితే అదే గుర్తుకు ఓటేసినట్లు నమోదవుతున్నట్లు పలువురి ఓటర్లతో ట్రయల్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నాగేశ్, రిజర్వ్‌డ్ ఎస్సై భగవాన్‌సింగ్, కంటె సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రం ఇస్తున్న తపస్ నాయకులు

జగిత్యాల: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవయ్య, ప్రసాద్‌రావు అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కోరుట్ల: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తపస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ కోరుట్ల మండల అధ్యక్షుడు గాడిపెల్లి అంజయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి రమేశ్ అందె శివ ప్రసాద్ పాల్గొన్నారు.

కొండగట్టు: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కొడిమ్యాలలో సోమవారం సంతకాలు సేకరించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర నాయకుడు వీరమల్ల వెంకట రమణరావు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మూమ్మాడి హరికృష్ణప్రసాద్ ఏనుగు ఆదిరెడ్డి పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సమస్యలు పరిష్కారం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన సోమవారం మున్సిపల్ పాలకవర్గం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 5 వార్డులో పలు చోట్ల ఇండ్ల మీద హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, వీటిని తొలగించాలని కౌన్సిలర్ యామ రాజయ్య కోరారు. 13వార్డులోని బాలకృష్ణ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారం కోసం అవసరమైన నిధులను కేటాయించాలని కౌన్సిలర్ బాల్క ముత్తమ్మ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మొత్తం 20 అంశాలను ప్రవేశపెట్టగా, కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి పొందిన జగదీశ్వర్‌గౌడ్‌ను, పదవీ విరమణ చేసిన కార్మికుడు కనుకయ్యను సన్మానించారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు

కోరుట్ల: భారీ వర్షాలకు కోరుట్ల మున్సిపల్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, మురికికాల్వలను పునర్నిర్మించడానికి నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తెలిపారు. సోమవారం చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలతో నీటి తొలగింపుతో పాటు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, మురికి కాల్వలు బాగు చేయానికి మొరం వేయడానికి సుమారు రూ.40 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ లైటింగ్ సిస్టం, మొక్కలకు నీరు పట్టడానికి రూ. 30 లక్షలతో డ్రిప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శ్మశానవాటిక బాగు కోసం రూ. 30 లక్షలు, మద్దుల చెరువు నుంచి నీటి మళ్లింపు కోసం కాల్వ తవ్వడానికి రూ. 5 లక్షలు, ఆధునిక స్లాటర్ హౌస్ నిర్మాణానికి రూ. 1. 33 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఆయాజ్, డీఈ అభినయ్, ఏఈ లక్ష్మి, జేఏవో శివ, మేనేజర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం


పంటల పరిశీలనకు బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మండలంలోని చిన్నమెట్‌పల్లి, మాదాపూర్, కల్లూర్, ధర్మారం, అయిలాపూర్ గ్రామాల్లో సోమవారం పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పంట నష్టం నివేదికలు సిద్ధం చేయించి ప్రభుత్వానికి అందజేసి పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. చెక్‌డ్యాంల వద్ద కోతకు గురైన ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. కల్లూర్ వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే హైలెవల్ వంతెన నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు గడికొప్పుల మాధురి, గంగాదర్, నాగిరెడ్డి సుబాష్‌రెడ్డి, చిట్నేని లత, సింగిల్‌విండో చైర్మన్లు బండి భూమయ్య, చింతకుంట సాయిరెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకుంటామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తెలిపారు. మండలంలోని రంగారావుపేట, కేసీఆర్ తండా, ఎఎస్సార్ తండా, ఆత్మకూర్, పాటిమీది తండాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న రహదారులతో పాటు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దన్నారు. ఆయన వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కేజీవీల్స్‌తో రోడ్డెక్కితే ట్రాక్టర్లు సీజ్ చేస్తాం


డీఎస్పీ రవీందర్ రెడ్డి

మెట్‌పల్లి/ మల్లాపూర్/ ఇబ్రహీంపట్నం: : మెట్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలోని మండలాల్లో రోడ్లపై కేజీవిల్స్ ట్రాక్టర్లను నడిపితే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి సోమవారం హెచ్చరించారు. ఆయా మండలాల్లో ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు వరినాట్ల కోసం రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడుపుతున్నారని, దీంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన రహదారులు ధ్వంసమవుతున్నాయని అన్నారు. రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపిస్తే యజమానులు, డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆ ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు ట్రాక్టర్లు సీజ్

కథలాపూర్: మేడిపెల్లి మండలంలోని పలు గ్రామాల్లో కేజీవీల్స్‌తో తారురోడ్డుపై వెళ్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపై నడపడం వల్ల రోడ్లు చెడిపోతున్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యవేక్షించగా.. మూడు ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో రోడ్డు వెళ్తూ కనిపించాయన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో తారు రోడ్డుపై కేజీవీల్స్‌తో వెళ్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. సోమవారం గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టామన్నారు. కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు తారురోడ్డుపై నడపడం వల్ల కోట్లాది రూపాయాలు వెచ్చించిన రోడ్లు చెడిపోతున్నాయన్నారు.

‘రహదారుల నిర్మాణం ప్రభుత్వానికి పట్టదా?’


వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: రహదారుల నిర్మాణం, మరమ్మతులు, అభివృద్ధి పనులపై ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్ అన్నారు. సోమవారం బీజేపీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ శ్రావణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండల కేంద్రంలోని ఒడ్డెర కాలనీ మీదుగా బైపాస్ రోడ్డుని బీటీ రోడ్డుగా మార్చాలని ఏళ్లుగా విన్నవించిన పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, బూత్ అధ్యక్షుడు గొల్లెన వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు శివరాత్రి అంజమ్మ, జిల్లా కార్యవర్గసభ్యులు గడ్డం నవీన్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

తెగిన కల్వర్టులను మరమ్మతు చేయాలి

పెగడపల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిన కల్వర్టులను మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని మండల బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెగడపల్లి మండలంలోని మద్దులపల్లిలో బతుకమ్మ వాగు వద్ద తెగిన కల్వర్టును సోమవారం బీజేపీ నాయకులు పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలతో కల్వర్టులు తెగిపోయి పంటపొలాలకు వెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తెగిన కల్వర్టులను త్వరగా మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొమురెల్లి, నాయకులు రమేశ్, రాజేశం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీలకు మరమ్మతులు చేపట్టాలి

కోరుట్ల: భారీ వర్షాలకు పట్టణంలో ధ్వంసమైన రోడ్లు, డ్రెయినేజీలకు మరమ్మతులు చేయాలని పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, బీజేపీ, బీజేవైఎం నాయకులు ప్రకాశం రోడ్డు నుంచి ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెండెం గణేష్, నాయకులు పీసరి నర్సయ్య, తిరుమల వాసు, పోతుగంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డుకు రైతుల మరమ్మతు


మట్టిని పోయించిన రైతులు

కథలాపూర్: మండలంలోని సిరికొండ- తక్కళ్లపెల్లి రోడ్డు సిరికొండ శివారులో వర్షాలకు కోతకు గురికాగా, రైతులే సొంత ఖర్చులతో రోడ్డును సోమవారం బాగు చేసుకున్నారు. కోతకు గురైన రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేయించడంలో జాప్యం జరగడంతో అటువైపు వెళ్లే రైతులకు కష్టంగా ఉంటుందన్నారు. పంటలను కాపాడుకోవడానికి రైతులందరూ కలిసి కోతకు గురైన రోడ్డు వద్ద ట్రాక్టర్లతో మట్టి పోయించామన్నారు. అనంతరం చదును చేయించామని రైతులు తెలిపారు.

రెనోవేషన్ కమిటీ ఎన్నికకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: రాయికల్ మండలం అల్లీపూర్‌వేణుగోపాలస్వామి ఆలయ రెనోవేషన్ కమిటీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను సెక్షన్ 19ని అనుసరించి నిర్ణీత ప్రొఫార్మాలో నోటీసు ఇచ్చినప్పటి నుంచి 10 రోజుల లోపు కరీంనగర్ జిల్లా ధర్మాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కోరుట్ల: పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బాత్‌రూం గోడ కూలి మృతి చెందిన విజేత కుటుంబాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొమిరెడ్డి కరమ్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కరమ్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కటుకం చంద్రశేఖర్, బత్తుల దీక్షిత్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కథలాపూర్: మండలకేంద్రంలో నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. దేవాలయం నిర్మాణానికి అయ్యే ఖర్చులు భరించేందుకు తాలుకా రాయమల్లయ్య ముందుకు వచ్చారని గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో టైల్స్ ఏర్పాటుకు మాజీ సర్పంచ్ కల్లెడ శంకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు వెలిచాల బుచ్చన్న, రిక్కల తిరుపతిరెడ్డి, నల్ల గంగారెడ్డి, మామిడిపెల్లి రాజారెడ్డి పాల్గొన్నారు.

కుటుంబానికి రూ.10 వేల పరిహారం అందించాలి

రాయికల్: భారీ వర్షాలకు నిరాశ్రయులైన బాధితులకు ఒక్కో కుటుంబానికి రూ. 10 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రాయికల్ పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన కుటుంబాలకు రూ.10 వేలు, నీటమునిగిన పంటలను సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందించాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, జిల్లా యూత్‌ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్‌రెడ్డి, నాయకులు సుదీర్, కిరణ్‌రెడ్డి, బాపురపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి కోరారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విషయంలో నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోరుమంతుల ప్రభాకర్, బోడ ప్రశాంత్, బాలరాజ్ , రాందాస్ తదితరులున్నారు.

మాచాపూర్‌లో తీరిన తాగునీటి సమస్య

సాక్షి స్పందన

కథలాపూర్: మేడిపెల్లి మండలం మాచాపూర్‌లో తాగునీటి సరఫరాను సోమవారం పునరుద్ధరించారు. సాక్షి దినపత్రికలో ‘మాచాపూర్‌లో తాగునీటి తిప్పలు’ అనే కథనం సోమవారం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ బాలరాజు బోరుబావి మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇప్పించి నల్లానీళ్లు వచ్చేలా ఏర్పాట్లు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన భవనంలోకి కార్యాలయం..

జగిత్యాలరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జగిత్యాల మండల పరిషత్ కార్యాలయం నీట మునిగింది. ఈ నెల 28 న ‘నీటమునిగిన మండల పరిషత్ కార్యాలయం’ సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఉన్నతాధికారులు నూతన భవనంలో మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయంలోకి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయం విధులు ప్రారంభించారు.

10 అంశాలకు పాలకమండలి ఆమోదం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తమ్మ

ధర్మపురి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ రమేశ్‌తో పాటు పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో 10 అంశాలను ఆమోదించినట్లు తెలిపారు. ప్రాపర్టీ టాక్స్ నోటీస్, జిరాక్స్ బిల్లు చెల్లింపు, సున్నం కొనుగోలు చేయుట, హరితహారంలో భాగంగా నూతనంగా నిర్మించిన డివైడర్లలో మొక్కలు నాటేందుకు రూ. 20 లక్షలు, సమీకృత మార్కెట్‌లో మొక్కలు నాటుటకు గ్రిల్స్‌కు రూ. 2 లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎస్డీఎఫ్ గ్రాంట్‌తో కమలాపూర్ రూట్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు, సీడీపీ నిధులతో శ్రీ శారదా మహిళా మండలి భవనానికి కంపౌండ్ వాల్, బోర్‌వెల్ ఏర్పాటు తదితర వాటిపై ఆమోదం తెలిపినట్లు చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ తెలిపారు.

రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యత


మాట్లాడుతున్న చైర్మన్ మోర హన్మండ్లు

రాయికల్: ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలో తెగిపోయిన రోడ్ల మరమ్మతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు తెలిపారు. సోమవారం రాయికల్ పురపాలక సంఘ సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలతో రోడ్లన్నీ దెబ్బతిన్నాయని, రోడ్లు, మురికికాలువలు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పట్టణంలో వైకుంఠ ధామం నిర్మాణ పనులు పూర్తి కావడం లేదని, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. అనంతరం 13 అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో కమిషనర్ సంతోష్‌కుమార్, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు మహేందర్, సాయికుమార్, శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, అన్వరిబేగం, శ్రీరాముల సువర్ణ, మ్యాకల కాంతారావు, అనురాధ, కో-ఆప్షన్ సభ్యులు వనిత పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉంటేనే గ్రామాలు అభివృద్ధి

కథలాపూర్: ప్రజలు ఐకమత్యంగా ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ జవ్వాజి రేవతి అన్నారు. మండలంలోని గంభీర్‌పూర్, మేడిపెల్లి మండలం కాచారం గ్రామాల్లో సోమవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. అధికారులు ఎస్సీ కాలనీల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీలపై వివక్ష చూపిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, ఆర్ఐలు నాగేశ్, రమేశ్, పోతు శేఖర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని ప్రతీ ఒక్కరు గౌరవించాలి

పెగడపల్లి:చట్టాన్ని ప్రతీ ఒక్కరు గౌరవించాలని సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. మండలంలోని నామాపూర్‌లో సోమవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టం అందరికి సమానమేనని చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే శిక్షార్హులు అవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రజిత, ఉప సర్పంచ్ సంతోష్, ఆర్డై శ్రీనివాస్, అంబేడ్కర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దట్నూర్‌లో సివిల్‌రైట్స్ డే

పెగడపల్లి:గొల్లపల్లి మండలంలోని దట్నూర్‌లో సోమవారం అధికారులు సివిల్‌రైట్స్‌డే నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ కులమతాలకు తావివ్వకుండా సమానంగా జీవించాలని ప్రజలకు సూచించారు. కులం పేరుతో దూషిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పావని, ఆర్డై రాణి, సోషల్ వెల్ఫేర్ అధికారి మహేందర్, ఏఎస్సై నర్సింగారావు. అంబేడ్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వరద బాధితులను ఆదుకోవాలి

పెగడపల్లి: గొల్లపల్లి మండలంలోని బొంకూర్ ఎస్సీ కాలనీలో భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ నాయకుడు గజ్జల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద బాధితులను సోమవారం ఆయన పరామర్శించి నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు. నాయకులు శ్రీధర్, సాగర్, శ్రీనివాస్, సతీశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించే వరకు పోరాటం

వెల్గటూర్: ఎల్లంపల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మద్దెల రవీందర్ అన్నారు. మండలంలోని చెగ్యాంలో పరిహారం కోసం భూనిర్వాసితులు చేస్తున్న నిరాహార దీక్షకు మద్దెల రవీందర్ సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామఅధ్యక్షుడు నందయ్య, సోషల్ మీడియా కన్వీనర్ దుర్గయ్య పాల్గొన్నారు.

గండిపడ్డ చెరువులు, కుంటలను పూడ్చి పరిహారం ఇవ్వాలి

మల్లాపూర్: భారీ వర్షాలకు చెరువులు, కుంటలకు గండిపడి జీవనోపాధిని కోల్పోయిన గంగపుత్రులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఎల్ల ఆశాలు అన్నారు. సోమవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందించారు. భారీ వర్షాలకు చెరువులకు గండి పడి చేపలు కొట్టుకుపోయాయని, గంగపుత్రులందరూ జీవనోపాధిని కోల్పోయారని బాధను వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం మండల ప్రధాన కార్యదర్శి తోకల పవన్, సలహాదారుడు ఎల్ల చిన్నదేవయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నంబరు ప్లేట్ మార్పించిన పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో సోమవారం రాత్రి ట్రాఫిక్ ఎస్సై సందాని వాహనాలు తనిఖీ చేస్తుండగా, మోరపల్లి గ్రామానికి చెందిన హరీశ్ తన వాహనానికి నంబరు ప్లేట్ కన్పించకుండా తిప్పిపెట్టాడు. దీంతో పోలీసులు గుర్తించి అక్కడే ఉన్న వెల్డింగ్ షాప్‌కు తీసుకెళ్లి దానిని తొలగించి కన్పించేలా అమర్చారు. హరీశ్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో జరిమానా విధించారు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

కొండగట్టు: మండలంలోని పూడూర్‌లో అంగన్‌డీ టీచర్లకు మిషన్ శక్తి స్కీం గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుధారాణి మహిళ సాధికారత 181 సఖీ 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ల గురించి వివరించారు. వివిధ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ అశ్విని నరేశ్, హేమ శ్రీ, గౌతమి అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు

జర్నలిస్టులకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలి

కోరుట్ల: జర్నలిస్టులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ. 10 లక్షల బీమా వర్తించేలా ప్రభుత్వం ఇన్సూరెన్స్ పాలసీలు చేయించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల కోరుట్లలో గుండెపోటుతో మృతి చెందిన జర్నలిస్ట్ గుండేటి కిరణ్ కుటుంబాన్ని జర్నలిస్టులు సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, టీయుడబ్ల్యుజే హెచ్ 143 జిల్లా అధ్యక్షుడు శికారి కామకృష్ణ, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆగ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

వెల్గటూర్: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన వెల్గటూర్ మండలం కోటిలింగాలలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాపాక మహేందర్ గేదె సోమవారం గ్రామ శివారులో మేతకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్‌కు గురై మృతిచెందింది. పాడి గేదె మృతితో సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు మహేందర్ తెలిపాడు.

విద్యార్థులకు దారి కష్టాలు

మల్లాపూర్: భారీవర్షాలకు మోడల్ స్కూల్ రోడ్డు నీటమునిగి పూర్తిగా ధ్వంసమైంది. మోడల్ స్కూల్ రోడ్డు వద్ద నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టినా.. ఆ రోడ్డుపై నుంచే సోమవారం కళాశాలకు అధ్యాపకులు, విద్యార్థులు భయంభయంగా హాజరయ్యారు. సాయంత్రం రోడ్డును దాటి వెళ్లేందుకు విద్యార్థులు భయపడగా, ప్రిన్సిపాల్ అలీమొద్దిన్, అధ్యాపకులు జాగ్రత్తగా విద్యార్థులందరిని దాటించారు. డీఈవో జగన్మోహన్‌రెడి విద్యార్థుల రాకపోకల గురించి ప్రిన్సిపాల్‌కి ఫోన్ చేసి వాకబు చేశారు.

నేటి నుంచి గ్రామాల్లో నట్టల నివారణ మందులు పంపిణీ

ధర్మపురి: ఈనెల 1 నుంచి 6 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు నట్టల నివారణకు మందులు ఇవ్వనున్నట్లు పశు వైద్యాధికారి రాజేందర్‌రెడ్డి తెలిపారు. నేడు రాజారం, నాగారం, రామయ్యపల్లె మందులు పంపిణీ చేస్తామన్నారు.